ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 04.08.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో నాలుగేళ్లుగా అసంపూర్ణంగా ఉన్న ఎల్.ఆర్.ఎస్ ప్రక్రియను , వచ్చే మార్చి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

2. తెలంగాణలో ఈ ఏడాది 12 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి, కొత్తగా 6 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది.

3. వరంగల్ జిల్లాలో కౌమార దశ బాలికల , సమగ్ర అభివృద్ధికి యూనిసెఫ్ సహకారంతో" స్నేహ" ప్రాజెక్టును అమలు చేస్తున్నారు.

4. విశాఖ రైల్వే స్టేషన్ లో కోర్బా – విశాఖ ఎక్స్ ప్రెస్ రైళ్లో మంటలు వ్యాపించి మూడు ఏసి బోగీలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అయితే ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు.

**ఎల్.ఆర్.ఎస్**

రాష్ట్రంలో నాన్ లేఅవుట్ భూముల క్రమబద్ధికరణ కోసం చేపట్టిన 2020 నాటి ఎల్.ఆర్.ఎస్. ప్రక్రియ వచ్చే ఏడాది మార్చి 2025 నాటికి పూర్తయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఖమ్మం సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా ఐ.డి.ఓ.సి నుంచి ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, న్యాయపరమైన దరఖాస్తుల రెగ్యులరేషన్ ప్రక్రియ మొదలుపెట్టాలని నిర్ణయించామని చెప్పారు. ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల స్క్రూటినీ సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సహాయక యంత్రాంగాన్ని అధికారులకు పూర్తి స్థాయిలో అందిస్తామని అన్నారు. ఎల్.ఆర్.ఎస్ ప్రక్రియ ద్వారా ఎక్కడ ప్రభుత్వ భూమికి నష్టం కలగ రాదని, అదే విధంగా నీటి వనరులు, కాలువలు, చెరువుల ఆక్రమణలకు పాల్పడవద్దని అధికారులకు సూచించారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఎల్.ఆర్.ఎస్ 2020 క్రింద 25 లక్షల 70 వేల 708 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో ఇప్పటి వరకు 4 లక్షల 28 వేల 832 దరఖాస్తుల స్క్రూటినీ చేసి 60 వేల 213 దరఖాస్తులను ఆమోదించి సదరు భూముల క్రమబద్ధికరణ చేశామని అన్నారు. ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న దాదాపు 20 లక్షలకు పైగా ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల స్క్రూటినీ ప్రారంభించాలని, 4 దశలలో ఎల్.ఆర్.ఎస్ స్క్రూటిని ఉంటుందని మంత్రి తెలిపారు.

(PTC)

**ఆయకట్టు**

రాష్ట్రంలో ప్రతి యేటా కొత్తగా 6 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్న తెలంగాణ ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ రూపొందిస్తుంది. ఈ ఏడాది 12

ప్రాజెక్టులను ప్రాధాన్యతా ప్రాతిపదికగా ఎంపిక చేసింది ఇందులో ఆరు ప్రాజెక్టులు గోదావరి బేసిన్ లో, మరో ఆరు ప్రాజెక్టులు కృష్ణా బేసిన్ లో ఉన్నాయి. గోదావరి బేసిన్ లో ఇప్పటికే 75 శాతానికి పైగా పనులు పూర్తైన ప్రాజెక్టులను పూర్తి చేసి 6 లక్షల ఎకరాలకు సాగునీరందించాలని ప్రభుత్వం భావిస్తోంది. వీటిలో చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల, ముడికుంట వాగు, చెనాక – కొరాట, లోయర్ పెన్ గంగా, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ఎత్తిపోతల, మొదలైన ప్రాజెక్టులు ఉన్నాయి. కృష్ణా బేసిన్ లోని ఆరు ప్రాధాన్య ప్రాజెక్టుల్లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన కోయిల్ సాగర్, బీమా, నెట్టంపాడు, కల్వకుర్తి ప్రాజెక్టులు ఉన్నాయి. అలాగే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, నారాయణపేట్ కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టుల మిగిలిన పనులు కూడా పూర్తి చేసి 2026 నాటికి ఆయకట్టుకు సాగునీరు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

డెస్క్

**సీతారామ ప్రాజెక్టు**

సీతారామ ప్రాజెక్టును ఈ నెలలోనే ప్రారంభిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలోని వి. కె రామవరం వద్ద పంపు హౌస్ 2 మోటార్ ట్రయల్ రన్ ను ఆయన పరిశీలించారు. అయితే సాంకేతిక కారణాల వల్ల ట్రయల్ రన్ సాధ్యపడకపోవడంతో.. ఈనెల 9 లోగా సీతారామ ప్రాజెక్ట్ రెండు పంపు హౌస్ ల ట్రయల్ రన్ ను పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల రైతులతో మాట్లాడుతూ.. ఆయిల్ ఫామ్ సాగుపై మరింత దృష్టి పెట్టాలని, విస్తీర్ణ సాగు పెరిగితే మరో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఇస్తామని హామీ ఇచ్చారు.

(PTC)

**సిఎం అమెరికా**

రాష్ట్రానికి పెట్టుబడులను రాబట్టేందుకు అమెరికా పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి న్యూయార్క్ లో ప్రవాస భారతీయులు ఘనంగా స్వాగతం పలికారు. 11 రోజుల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలోని పలు నగరాలతో పాటు దక్షిణ కొరియాలోని సియోల్ కూడా సందర్శిస్తారు. అమెరికాలో 8 రోజులు, దక్షిణ కొరియాలో 2 రోజుల పర్యటన కొనసాగుతుంది. రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ప్రభుత్వ అధికారులు ఈ పర్యటనలో పాల్గొంటున్నారు. ఈరోజు మంత్రి శ్రీధర్ బాబు, రేపు మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా అమెరికా పర్యటనకు బయలుదేరుతున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను, ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహకాలను ముఖ్యమంత్రి నాయకత్వంలోని బృందం ఈ సందర్భంగా అక్కడి వ్యాపార, వాణిజ్య ప్రముఖులకు వివరిస్తుంది.

డెస్క్

<u>**రిజర్వేషన్లు**</u>

ఎస్సీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్ చేస్తామని లోక్ జన శక్తి పార్టీ నాయకుడు, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ తెలిపారు. అణగారిన వర్గాలను పైకి తీసుకువచ్చేందుకు ఎస్సీ కోటాను ప్రవేశపెట్టారని, అయితే ఉప వర్గీకరణ వల్ల అసలు ప్రయోజనానికి హాని కలుగుతుందని ఆయన అన్నారు.

ఎన్ఎస్డి

<u>**సిపిఐ**</u>

వ్యవసాయ కార్మికులకు, గ్రామీణ కూలీలకు సమగ్ర కార్మిక సంక్షేమ చట్టం అమలు చేయాలని సిపిఐ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయల భృతి చెల్లించాలని, 57 సంవత్సరాలు దాటిన కూలీలకు 6 వేల రూపాయల పింఛన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణా తరగతుల్లో చాడా వెంకట్

రెడ్డి పాల్గొన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

పిటిసి, రాజన్న సిరిసిల్లా

**యూనిసెఫ్**

వరంగల్ జిల్లాలో కౌమార దశ బాలికల సమగ్ర అభివృద్ధికి స్నేహ అనే పేరుతో బాలికల భద్రత, పోషకాహార, సాధికారత, ఆరోగ్య  కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సత్య శారద తెలిపారు. యూనిసెఫ్ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం తొలిసారిగా వరంగల్ జిల్లాను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిందని,కలెక్టర్ ఛైర్మెన్ గా, డి ఆర్ డి ఓ కన్వీనర్ గా,  15 శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. బాల్య వివాహాలు నిరోధించడం, రక్తహీనత, పోషకాహార లోపం వంటి ఆరోగ్య సమస్యలను పరిష్కరించండం, డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కలిగించడం,  నాణ్యమైన విద్య  వృత్తి శిక్షణ అందించేలా చూడడం, ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించడం మొదలైన కార్యక్రమాలను 'స్నేహ' కింద అమలు చేస్తారు.

(PTC)

**రైలు - మంటలు**

విశాఖపట్నం రైల్వేస్టేషన్లో   ఆగి ఉన్న కోర్బా - విశాఖ ఎక్స్ప్రెస్  రైలు ఏసీ బోగీల్లో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో బీ 6, బీ 7, ఎం 1 ఏసీ బోగీలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఆ సమయంలో రైలులో ప్రయాణికులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రైల్వే సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. షార్ట్సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగిఉండొచ్చని రైల్వే సిబ్బంది భావిస్తున్నారు.

(DESK)

**గంజాయి**

హైదరాబాద్ లోని పెద్ద గోల్కొండ వద్ద అవుటర్ రింగ్ రోడ్ పై పోలీసులు పెద్ద మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పెద్ద అంబర్ పేట్ వైపు నుంచి గచ్చిబౌలి వైపు వెళ్తున్న ఒక కంటైనర్ లో సుమార్ 800 కిలో గంజాయిని బాలానగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని ఒడిస్సా నుంచి తరలిస్తున్నట్లుగా గుర్తించారు. కంటైనర్ డ్రైవర్ ను అందుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో మొత్తం ఏడుగురిని నిందితులుగా గుర్తించామని, వారిలో ఐదుగురిని అరెస్ట్ చేశామని పోలీసులు చెప్పారు.

ప్రెస్ నోట్

**శ్రీశైలం**

శ్రీశైలం రిజర్వాయర్ కు నీటి ఉధృతి కొనసాగుతోంది. జూరాల, సుంకేశుల జలాశయాల నుంచి భారీగా వస్తున్న ఇన్ ఫ్లో తో శ్రీశైలం ప్రాజెక్టు పరవళ్లు తొక్కుతోంది. ఇప్పటికీ 5 లక్షలకుపైగా క్యూసెక్కుల నీరు వస్తుండటంతో- శ్రీశైలం ప్రాజెక్టు 10 గేట్లను 20 అడుగుల మేర ఎత్తారు. అలాగే కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నురగలు కక్కుతూ పరుగులు పెడుతున్న కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు పర్యాటకులు వేల సంఖ్యలో తరలివస్తున్నట్టు మా నాగర్ కర్నూల్ విలేకరి తెలియచేస్తున్నారు. ఇదిలా ఉండగా, హైదరాబాద్ కు చెందిన పర్యాటకుల వాహనం అమ్రాబాద్ మండలం వటవర్లపల్లి గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఢీకొట్టిన ఘటనలో బొల్లారంకు చెందిన ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరి పరిస్థితి తీవ్రంగా ఉంది.

(PTC)

**నాగార్జున సాగర్**

నాగార్జున సాగర్లో గంట గంటకు నీటి నిల్వలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం నీటిమట్టం 575 అడుగులు చేరింది. ఇన్ ఫ్లో 3 లక్షల 54 వేల క్యూసెక్కులు పైగా ఉండగా, కుడి, ఎడమ కాల్వలతో పాటు ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 35 వేల 409 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పిటిసి, నల్గొండ

**వరంగల్ -సీజనల్ వ్యాధులు**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా 200 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ సూచించారు. 66 డివిజన్ లలో దోమల నిర్మూలనకు పట్టిష్టమైన చర్యలు చేపట్టినట్టు తెలిపారు. దీర్ఘ కాలం నిలువ ఉండే నీటిలో గంబూసియ చేపలను వదిలామని, డెంగ్యూ తరహా కేసులు నమోదైన నేపథ్యంలో ఆ ప్రాంతాలలో దోమల నివారణ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. వరంగల్ నగర పరిధిలో ఇప్పటి వరకు 36 డెంగ్యూ కేసులు నమోదు కాగా ఎలాంటి మరణాలు సంభవించలేదన్నారు.

(PTC)

**జగిత్యాల - అరెస్టు**

అసలు కరెన్సీ నోట్లకు ఐదింతల నకిలీ నోట్లు ఇస్తామంటూ ఆశ చూపి ప్రజలను మోసం చేస్తున్న ముఠాను జగిత్యాల జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు జగిత్యాల, నిర్మల్ జిల్లాలకు చెందిన ఆరుగురు ముఠాగా ఏర్పడి హైదరాబాద్, కరీంనగర్ జగిత్యాల ప్రాంతాల్లో పలువురి వద్ద నుండి లక్షల రూపాయలు వసూలు చేసి మోసం చేసినట్లు మెట్పల్లి డి.ఎస్.పి ఉమామహేశ్వరరావు వెల్లడించారు.

(PTC)